





ప్రతి విద్యార్థికి ఉపాధ్యాయుడే
రోల్‌మోడల్

- తల్లిదండ్రుల పాత్రా కీలకమే
- కేంద్రం నిధులతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్



విద్యార్థులతో మాట్లాడుతున్న పవన్‌కళ్యాణ్



అభిమానులకు అభివాదం చేస్తున్న పవన్‌కళ్యాణ్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి ఉపాధ్యాయుడే రోల్‌మోడల్ అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అన్నారు. శనివారం కడప నగరపాలక ఉన్నత పాఠశాల (మెయిన్)లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రితో పాటు కలెక్టరు డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితిసింగ్, రాష్ట్ర పీఆర్ అండ్ ఆర్‌డీ కమిషనరు క్రిష్ణతేజ, ఇన్‌చార్జ్ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, కడప ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ మాధవి, ప్రొద్దుటూరు, కమలాపురం ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, క్రిష్ణచైతన్యరెడ్డిలు హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పవన్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమన్నారు. పిల్లలు ఎవరిని చూస్తూ పెరుగుతారో వారిలాగానే మారుతారని, ముఖ్యంగా సోషల్ మీడియాకు బానిసైతే జీవితాలు నాశనం అవుతాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం మౌలిక వసతులే కాకుండా విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను, సత్ప్రవర్తనను నేర్పించే ప్రధాన ఉద్దేశ్యంతో రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. అందుకోసం పాఠశాల నిర్వహణ కమిటీలను పటిష్ఠంగా నిర్వహిస్తూ తల్లిదండ్రులు, ఉపాధాయులను సమన్వయం చేస్తూ పేరెంట్స్, టీచరు సమావేశాలను అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తున్నారన్నారు. ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి ఆదర్శవంతంగా ముందుకు వెళ్లాలన్నారు. పాఠశాలలకు సంబంధించి ఏ అభివృద్ధి కార్యక్రమమైనా పేరెంట్స్ కమిటీల ద్వారానే నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కవులు, సాహిత్యవేత్తలకు పుట్టినిల్లు

ఎందరో విద్యావేత్తలు, కవులు, సాహిత్యవేత్తలకు పుట్టినిల్లు కడప జిల్లా అని పవన్‌కళ్యాణ్ కొనియాడారు. ఈ ప్రాంతంలో అత్యధిక లైబ్రరీలు ఉన్నాయని, పుస్తకనిధి అధికంగా ఉండడంతో ఇక్కడ ప్రజల్లో విజ్ఞాన సంపద కూడా అధికంగా ఉంటుందనే భావనను వ్యక్తం చేశారు. నీటి సమస్యను తీర్చి ఇక్కడ ప్రజలను ఆదుకుంటామన్నారు. రాయలసీమ అంటేనే చదువుల నేల అని, ఇలాంటి ప్రాంతానికి రావడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సీమ అంటే అభివృద్ధికి వెనుకబాటు కాదని, అవకాశాలు అందించే వనరుల నిధి అన్నారు.

పాఠశాల అభివృద్ధికి సొంత నిధులు

కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్ పాఠశాల అభివృద్ధి పనుల కోసం నిధులను తన సొంత ట్రస్టు నుంచి అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ పాఠశాలల్లో ఎలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు జరిగినా అందుకు బహుమతులు, జ్ఞాపికలు ఖర్చులు కూడా తానే స్వయంగా భరిస్తానన్నారు. దూరంగా ఉండే పాఠశాలలకు ప్రత్యేకంగా విద్యార్థుల కోసం బస్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. దేశ భద్రత కోసం ప్రాణాలర్పించిన అమరువీరులను, ప్రతిరోజూ మన పరిసరాలను శుభ్రపరిచే పారిశుధ్య కార్మికుల రుణం తీర్చుకోలేనిదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల ద్వారా విద్యార్థుల సంఖ్య క్రమేపీ పెరుగుతుందన్నారు. ఆ దిశగా విద్యాశాఖ పనిచేస్తుందన్నారు.

కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తుల పూర్వాపరాలు పరిశీలిస్తే వారి విద్యాభ్యాసం సాగించిందంతా ప్రభుత్వ పాఠశాలల్లోనేనని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా వదిలేసిన పాఠశాలల భవనాల నిర్మాణాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కడప జిల్లాను సేవ్ కడప సేవ్ ఆంధ్ర ప్రదేశ్ అన్న నినాదంతో నేరరహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. కలెక్టరు డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు ప్రవేశపెట్టారని, మనబడి - మన భవిష్యత్తు అనే బృహత్తర కార్యక్రమం ద్వారా అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలు, యువత మాదక ద్రవ్యాల వినియోగం అనే అంశంపై ఆ పాఠశాల పరిధిలోని వార్డు సచివాలయ మహిళా పోలీసు శాంతకుమారి, జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

విద్యార్థులతో ముఖాముఖి

మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో ఏర్పాటు చేసిన పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో భాగంగా విద్యార్థులతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కాసేపు ముచ్చటించారు. ప్రతి బెంచ్ వద్దకు వెళ్లి విద్యార్థులను ఆప్యాయంగా పేర్లు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కరచాలనం చేశారు. పింగళివెంకయ్య బ్లాక్ 8వ తరగతి బీసెక్షన్‌లో విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం పదో తరగతి బీసెక్షన్ విద్యార్థులు తయారు చేసిన రైల్వే రోప్ ఎలివేటర్ ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. అనంతరం పదోతరగతి డీసెక్షన్ విద్యార్థులతో ముచ్చటించారు. డిజిటల్ బోర్డును పరిశీలించారు. అలాగే అంతర్జాతీయ, జాతీయ రాష్ట్రస్థాయి క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో మాట్లాడి వారికి కావాలసిన అవసరాలను అడిగి తెలుసుకున్నారు.

రంగోళి

పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు, తల్లిదండ్రులు వేసిన రంగోలి ముగ్గులను పవన్‌కళ్యాణ్ పరిశీలించారు. తల్లిదండ్రులతో సెల్ఫీ దిగారు.

ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కడప ఎయిర్ పోర్టుకు ఉదయం 11 గంటలకు చేరుకోగానే కలెక్టరు శ్రీధర్, జేసీ అదితిసింగ్, కమలాపురం ఎమ్మెల్యే క్రిష్ణచైతన్య ఘనస్వాగతం పలికారు. అనంతరం 11:07 గంటలకు విమానాశ్రయం నుంచి బయలుదేరి 12 గంటలకు మున్సిపల్ హైస్కూల్‌కు చేరుకున్నారు. 2:30 గంటల వరకు హైస్కూల్‌లో ఉండి 2:46 గంటలకు కడప విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడి నుంచి విజయవాడకు బయలుదేరి వెళ్లారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఎర్విన్, మున్సిపల్ కమిషనరు మనోజ్‌రెడ్డి, డీఈవో మీనాక్షి, ఎంఈవో గంగిరెడ్డి, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ శైలజ, జనసేన నాయకులు తుంగా రమణయ్య, అతికారి క్రిష్ణ, స్థానిక కార్పొరేటరు సూర్యనారాయణ పాల్గొన్నారు.





సహపంక్తి భోజనం

విద్యార్థులతో కలిసి పవన్‌కళ్యాణ్ సహపంక్తి భోజనం చేశారు. స్కూల్లో ఉన్న మెనూలో ఉన్న ప్రకారం ప్రతిరోజూ భోజనం అందుతుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. శనివారం మెనూలో వైట్ రైస్, పప్పు, విజిటేబుల్ కర్రీ, స్వీట్ పొంగల్, చిక్కీని ఆయన పరిశీలించారు.

విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం

- ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి

వేంపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో కొన్ని విద్యాలయాలు మద్యం షాపులుగా, గంజాయి నిలయాలుగా, డ్రగ్స్ కేంద్రాలుగా, అసాంఘీక శక్తుల అడ్డాలుగా తయారయ్యాయన్నారు. ఆ దుష్ట సంస్కృతి టీడీపీ కూటమి పాలనలో కూడా కొనసాగుతోందని ఆరోపించారు. గతంలో టీచర్లంటే విద్యార్థులు భయపడేవారు.. గౌరవించే వారు.. ప్రస్తుతం సీన్ రివర్స్ అయిందన్నారు. తల్లికి వందనం పథకం కింద ఒక్క పైసా విడుదల చేయలేదని, విద్యా దీవెన, వసతి దీవెన పథకాల కింద ఒక్క ఇన్‌స్టాల్‌మెంట్ కూడా విడుదల చేయలేదన్నారు. అలాగే గత పదిరోజులుగా చిత్తూరు,తిరుపతి జిల్లాలో ఏనుగుల గుంపు స్వైర విహారం చేస్తోందని, పంటలను నాశనం చేస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు.

మామిడికి పంటల బీమా అమలు

- డిసెంబరు 15 నుంచి మే 31 వరకు వర్తింపు

కడప రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మామిడికి పంటల బీమా అమలు చేసినట్లు ఉద్యానశాఖ జిల్లా అధికారి ఎస్ఎస్‌వీ సుభాషిణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ పునర్‌వ్యవస్థీకరించిబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని (ఆర్‌డబ్ల్యుబీసీఐఎస్) మామిడి పంటకు 2014-25 రబీకి అమలు చేసినట్లు తెలిపారు. ఇందుకు రైతు ఒక ఎకరాకు రూ.2,100 ప్రీమియం చెల్లిస్తే రూ.42,000లు పరిహారంగా చెల్లిస్తారు. ఐదు సంవత్సరాలు పైబడిన మామిడి తోటలకు మాత్రమే బీమాను వర్తింపజేసినట్లు వివరించారు. భూమి పాస్‌బుక్ జిరాక్స్ పత్రాలు, రైతుసేవా కేంద్రం నుంచి పంట వేసినట్లు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు రైతులు తీసుకొని సమీప సచివాలయంలోని రైతుసేవా కేంద్రాలలో డ్యాక్యుమెంట్లు ఇచ్చి నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి రేపు కడపకు రాక

కడప కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో పాల్గొనే నిమిత్తం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీదర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె ఈ నెల 9న సోమవారం జిల్లాకు చేరుకుంటారని, అదే రోజు ఉదయం ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లిలో, మధ్యాహ్నం కమలాపురం మండలంలోని చిన్నచెప్పలిలో జరిగే రెవెన్యూ సదస్సుల్లో పాల్గొంటారని తెలిపారు. ఆయా మండలాల గ్రామప్రజలు రెవెన్యూ సదస్సులకు హాజరై తమ సమస్యలపై అర్జీలు సమర్పించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.



కడప విమానాశ్రయంలో పుష్పగుచ్ఛం ఇచ్చి ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి

రియల్ ధమాల్

ప్లాట్లలోకి సర్రున దూసుకుపోయే కార్లు కనిపించడం లేదు. మందీ మార్బలంతో రోజంతా చలాకీగా గిరగిరా తిరిగే రియల్ వ్యాపారులు అదృశ్యమయ్యారు. విలాసాలు, వినోదాలతో హోరెత్తించే పెద్ద మనుషుల జాడ మచ్చుకైనా లేదు. సరిగ్గా ఏడాది కిందట ఉన్న హంగూ ఆర్భాటం ఇప్పుడు ఎక్కడా లేదు. క్రయ, విక్రయాలు జోరుగా సాగితే హాయిగా గడిపేద్దామనుకుని పెట్టుబడి పెట్టి నష్టపోయిన వారెందరో. గడిచిన ఐదు నెలలుగా రియల్ ఎస్టేట్ కుదేలైంది. బహుళ అంతస్తుల ధరలు నేలకు దిగి వచ్చాయి. రహదారుల పక్కన ఉన్న భూముల ధరలు అంతకంటే మించి చతికిలపడ్డాయి. దాదాపు జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.200 కోట్లు విలువ చేసే స్థిరాస్తులు అడ్వాన్సులకే పరిమితమయ్యాయి. ఎక్కడికక్కడ లావాదేవీలు స్తంభించడంతో రిజిస్ట్రేషన్లు జరగక ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది.

- స్తంభించిన లావాదేవీలు
- దివాళా దిశగా రియల్టర్లు
- ఎక్కడా కొనుగోలు ఊసే లేదు
- అప్పుల ఊబిలో వ్యాపారులు
- పడిపోయిన రిజిస్ట్రేషన్లు
- ప్రభుత్వానికి తగ్గిన ఆదాయం



ప్లాట్లుగా వేసిన భూమి

పులివెందులటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడుపువ్వులు.. ఆరుకాయలుగా సాగింది. ఇందులో శ్రీమంతులుగా ఎదిగిన వారు జిల్లాలో ఎందరో ఉన్నారు. తక్కువ సమయంలో కోట్ల రూపాయలు కూడబెట్టారు. ఇది గత సంవత్సరం కిందట వరకు ఉన్న పరిస్థితి. జిల్లాలో గత ఐదునెలల నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా పడిపోయింది. అప్పులు తెచ్చి మరీ ఈ వ్యాపారంలో దందా సాగించిన వ్యాపారులు, మధ్యవర్తులు అప్పుల ఊబిలోకి వెళ్లి తలలు పట్టుకుంటున్నారు. కరోనా సమయం నుంచి రియల్ వ్యాపారంపై తీవ్ర ప్రభావం పడింది. ప్లాట్ల ధరలు అడ్డగోలుగా పెరగడంతో సామాన్యులు ఇంటి స్థలం కొనలేని పరిస్థితి. దీంతో కొనుగోలు, అమ్మకాలు జరగక రిజిస్ట్రేషన్లు తగ్గిపోవడంతో ప్రభుత్వ ఆదాయం సైతం పడిపోయింది. కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, పులివెందుల ప్రాంతాల్లో ఆరంభమైన రియల్ పతనం ఐదు నెలలు వ్యవధిలోనే అంతటా విస్తరించింది. ఆఖరికి నూతనంగా ఏర్పాటవుతున్న జాతీయ రహదారులు పక్కనే ఉన్న భూముల ధరలు ఒక్కసారిగా ప్రతిష్టంభనకు గురయ్యాయి. పులివెందుల ప్రాంతంలో ఎకరా రూ.ఐదు కోట్ల నుంచి ఆరు కోట్లు ఉండగా, ప్రస్తుతం సగానికి పడిపోయాయి. అలాగే ముఖ్య పట్టణాల్లోనూ రియల్ ఎస్టేట్ ఈ మధ్య పతనమైంది. లెక్కకు మించి భవనాలు, విల్లాలు, వ్యక్తిగత గృహాలు ఎడాపెడా నిర్మించినా సగానికి సగం కొనుగోలుకు దూరంగా మిగిలాయి.

ఎకరా రూ.కోట్లలో.. మూర రూ.లక్ష పైగానే

కడప జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గ ప్రాంతాల్లో భూముల ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్యులు కొనలేని పరిస్థితి ఎదురవుతోంది. కడప పట్టణంతో పాటు చుట్టుపక్కల నియోజకవర్గాల్లోనూ ఎకరా భూమి కోట్లలో పలుకుతుండగా మూర రూ.లక్షకు పైగానే ఉన్నట్లు తెలుస్తోంది. పట్టణ కేంద్రాలతో పాటు గ్రామాల్లో సెంటు భూమి రూ.50 వేల నుంచి లక్ష వరకు ధర పలుకుతుంది. 40 మూరలు కొనాలంటే 40 లక్షల వరకు చెల్లించాల్సి వస్తుంది. ఇంత పెద్ద మొత్తంలో వెచ్చించి సామాన్యులు ప్లాటు కొనే పరిస్థితి లేదు.

లబోదిబోమంటున్న వ్యాపారులు

గత ఐదేళ్ల కిందట రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగడంతో వ్యాపారులు కోట్లు గడించారు. దీంతో చాలా మంది రియల్ వ్యాపారంలోకి దిగారు. ఫైనాన్స్ నుంచి డబ్బులు తెచ్చి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టారు. అయితే గత ఐదునెలల నుంచి రియల్ వ్యాపారం పడిపోవడం, ఇదే సమయంలో ఎన్నికలు రావడంతో రియల్ వ్యాపారం పూర్తిగా పడిపోయింది. ఫైనాన్స్‌లో డబ్బులు తెచ్చి రియల్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టి కుదేలైన వారూ ఉన్నారు. పైకి చెప్పుకోలేక హుందాతనాన్ని కొనసాగిస్తున్న వ్యాపారులు ఎందరో ఉన్నారు.

తగ్గిన రిజిస్ట్రేషన్లు

రియల్ వ్యాపారం కుదేలవడంతో రిజిస్ట్రేషన్లు తగ్గి ప్రభుత్వ ఆదాయంపై ప్రభావం చూపుతోంది. కడప రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గతంలో రోజుకు 200 వరకు, పులివెందుల ప్రాంతంలో రోజుకు 50 నుంచి 100 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు అయ్యేవి. రిజిస్ట్రేషన్లు ఫీజుల ద్వారా నెలకు రూ.కోట్లలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరేది. అయితే కరోనా కారణంగా తగ్గుతూ వచ్చిన రిజిస్ట్రేషన్లు ఇప్పటికీ కోలుకోవడం లేదు. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఆదాయం తగ్గిందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

నిర్మాణాలు ఎక్కడికక్కడే..

అమ్మకాలు సరాసరిన నిలిచిపోవడంతో ఇప్పుడు భవన నిర్మాణాలు ఎక్కడికక్కడే నిలిచాయి. జిల్లా వ్యాప్తంగా పట్టణాలతో పాటు మిగతా ముఖ్య ప్రాంతాల్లోనూ దాదాపు వందల్లో నూతన భవన నిర్మాణాలు స్తంభించాయి. పెట్టుబడి లేక చతికిలబడ్డాయి. దీనికి తోడు అప్పటికే లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టిన వారు ఇక కొనసాగించే మార్గాలు లేక నీరసించారు. కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు వంటి ప్రాంతాల్లో పరిస్థితి దయనీయంగా మారింది. రియల్ ఎస్టేట్‌ను నమ్ముకున్న అనేక మంది ఇప్పుడు దిక్కుతోచని పరిస్థితిలో ఉండిపోయారు.

పల్లెపండుగ పనులకు మంచిపేరు

- పీఆర్‌అండ్ ఆర్‌డీ కమిషనర్ కృష్ణతేజ

కడపరూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న రహదారుల పనులకు ప్రజలు సంతోషిస్తున్నారని ఇందుకు ప్రభుత్వం ద్వారా పంచాయతీరాజ్‌శాఖకు మంచిపేరు వచ్చిందని ఇందుకు తగ్గట్టుగా ఆయాశాఖల అధికారులు బాధ్యతగా పనిచేయాలని పీఆర్‌అండ్ ఆర్‌డీ కమిషనర్ కృష్ణతేజ ఆదేశించారు. నగరంలోని కడప నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్స్‌లో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్ సమావేశానికి హాజరవడానికి వచ్చిన సందర్భంగా స్టేట్ గెస్ట్‌హౌస్‌లో పీఆర్‌అండ్‌ఆర్‌డీ శాఖ పరిధిలోని జిల్లా అధికారులతో పథకాల అమలు, అభివృద్ధి పనులపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పల్లెపండుగ పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో గ్రావెల్ రోడ్లు, సిమెంట్ రోడ్లు, తారు రోడ్ల ఏర్పాటుతో పాటు స్కూల్ కాంపౌండ్ నిర్మాణ పనులను చేపడుతోందన్నారు. ఈ పనుల ద్వారా పల్లె ప్రాంతాల్లో రవాణా సౌకర్యం మెరుగుపడుతుండడంతో ప్రజలు సంతోషపడుతున్నారన్నారు. పల్లెపండుగ ద్వారా చేపడుతున్న పనులను డిసెంబర్ నాటికి పూర్తిచేయాలన్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖ ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి రాష్ట్రప్రభుత్వం చేపట్టిన పల్లెపండుగ కార్యక్రమం ద్వారా జిల్లాలో రూ.75 కోట్ల పనులు జరుగుతున్నాయని, ఇప్పటి వరకు రూ.30 కోట్ల పనులు పూర్తయ్యాయన్నారు. మిగిలిన పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేస్తామన్నారు. జడ్పీ, డీపీవో, ఆర్‌డబ్ల్యుఎస్, డ్వామా శాఖల అధికారులు వారి పరిధిలోని అభివృద్ధి పనుల తీరుతెన్నులను తెలియజేశారు.

కమిషనర్‌ను కలిసిన అధికారులు

కడప నగరం స్టేట్ గెస్ట్‌హౌస్‌లో గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ్‌ను జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ, డీపీవో రాజ్యలక్ష్మి, పంచాయరాజ్ ఇంజనీరింగ్‌శాఖ ఎస్ఈ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇన్‌చార్జ్ ఎస్ఈ ఏడుకొండలు, డ్వామా పీడీ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. కాగా కమిషనర్ రాకతో జడ్పీలో హడావిడి నెలకొంది.



కమిషనర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జడ్పీ సీఈవో ఓబులమ్మ

కలెక్టరేట్ ముఖ ద్వారం ఎదుట.. జాయింట్ కలెక్టర్ పేషీ దగ్గర..





నిఘా నీడలో కలెక్టరేట్

● ప్రతి సెక్షన్‌లోనూ సీసీ కెమెరాలు ● సిబ్బందిపై నిఘా

● ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్న జేసీ

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో రెండు రోజుల క్రితం 12 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పటిష్టం చేశారు. కలెక్టరేట్‌కు వచ్చేవారు పోయే వారిపై కూడా నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. కలెక్టరేట్‌లోని ప్రతి సెక్షన్‌లో రెండు సీసీ కెమెరాలు ఏర్పా టు చేసి సిబ్బందిపై మరింత నిఘా పెట్టారు. ప్రతిరోజూ కలెక్టరేట్ సి బ్బంది ఎన్ని గంటలకు వస్తున్నారు. ఎన్ని గంటలకు వెళుతున్నారు అన్న విషయాలపై జాయింట్ కలెక్టర్ పూర్తిగా ఆరా తీసే పనిలో ఉన్న ట్లు తెలుస్తోంది. అసలు కలెక్టరేట్‌లో 12 కెమెరాలు ఎందుకు పెట్టాల్సి వచ్చింది. అంటే సిబ్బంది వస్తున్నారా లేదా వచ్చిన తర్వాత ఏం చేస్తున్నారు అన్న విషయాలపై జాయింట్ కలెక్టర్ ప్రతిరోజూ పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలుస్తోంది. కలెక్టరేట్‌లోని కొంతమంది సిబ్బంది సమయానికి రాకుండా ఏదో ఒక సాకు చెప్పి గంటల తరబడి ఫోన్‌లో మాట్లాడుతున్నారని, అటువంటి వారి వల్ల కలెక్టరేట్‌కు చెడ్డపేరు వస్తోందన్న ఉద్దేశ్యంతో ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు కొంత మంది అధికారులు చెప్పుకొస్తున్నారు. ఈ విషయంపై కలెక్టరేట్ ఏవో నాగభూషణంను వివరణ కోరగా కలెక్టరేట్ సిబ్బంది సమయానికి రాకపోవడం వల్లనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంకా కొన్ని రోజుల తర్వాత ప్రతి ఒక ఉద్యోగి ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.



కో-ఆర్డినేషన్ సెక్షన్‌లో..

నాగన్న స్టేజి ఎక్కితే.. అవార్డుల పంటే

● పౌరాణిక, జానపదంలో ఆయన నటన అద్భుతం

● ఐదువేల ప్రదర్శనలతో నేటికీ కళామతల్లి సేవలోనే



అవార్డులతో నాగన్న

చెన్నూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆయన పుట్టిందో పల్లెటూరు.. వృత్తిరీత్యా బ్యాంకు ఉద్యోగి. ప్రవృత్తి కళాకారుడు. నటనలో మేటిగా రాణిస్తున్న ఆయన స్టేజీ ఎక్కాడంటే అవార్డు ఆయన వద్దకు రావాల్సిందే. ఎందరో ప్రముఖుల ప్రశంసలు అందుకుని 50 ఏళ్లకు పైగా నాటకంలో రాణిస్తూ అద్భుతం అనిపించుకున్న ఆ కళాకారుడే చెన్నూరుకు చెందిన సురతాని నాగన్న. జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు లెక్కలేనన్ని అవార్డులు అందుకున్న నాటక బ్రహ్మ. చెన్నూరు స్టేట్ బ్యాంకులో అసిస్టెంటు మేనేజరుగా పని చేసి పదవీ విరమణ పొందారు. ఆయన స్వగ్రామం చక్రాయపేట మండలం నెరసుపల్లె. 1954లో జన్మించారు. 1972లో 9వ తరగతి చదివే సమయంలో చిన్నపాటి వేషధారణలతో నటనపై మక్కువతో అడుగు పెట్టి 50 ఏళ్లుగా నాటకాల్లో వైవిధ్యభరితమైన పాత్రల్లో రాణించాడు.

5 వేలకు పైగా నాటకాలు

ఐదువేలకు పైగా నాటకాల్లో పాల్గొన్న ఆయన 200కు పైగా వివిధ రకాల వేషాలతో కళలు ప్రదర్శించారు. 150 ఏకపాత్రాభినయాలతో ప్రముఖుల మన్ననలు అందుకున్నారు. 50 మార్లు దశరధుడి పాత్రలో ఇమిడి తన అద్భుత నటనా కౌశల్యంతో ఆకట్టుకున్నాడు. 1984లో సవేరా ఆర్ట్స్ గ్రూపులో సభ్యుడిగా చేరి ఆ సంస్థకు 12 మార్లు నంది అవార్డు వచ్చేందుకు కృషి చేశారు. జనకుడు, గౌతముడు, బ్రహ్మ, రావణుడు, రావణబ్రహ్మ, మాయారావణుడు, విభీషనుడు, వెంకటేశ్వరుడు, మారీచుడు, యముడు, మారుతి, తాంద్రపాపారాయుడు, శకుని, అర్జునుడు, శ్రీనాధ కవి, హరిశ్చంద్ర ఇలా ఎన్నో వైవిధ్యమైన పౌరాణిక జానపద పాత్రల్లో అద్భుతంగా నటించారు. స్టేజీపై నిలిచాడంటే తన పాత్రలో ఒదిగిపోయి ప్రేక్షకుల చేత తప్పట్లు, ప్రముఖుల చేత శాలువాలు కప్పించుకోవడం సాధారణమైంది. ఏ పాత్ర వేసినా తనకు తానే సాటి అనిపించుకున్నాడు. ఆ పాత్రను చూసిన ప్రేక్షకుడు ఈ పాత్ర నాగన్న మాత్రమే చేయగలడనే విధంగా అనిపించుకున్నాడు.

ఆరు రాష్ట్రాల్లో అలరించిన కళాకారుడు

ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒరిస్సా ఈ ఐదు రాష్ట్రాల్లో కళాకారుడుగా వివిధ రకాల పాత్రలతో నాగన్న అలరించాడు. వెంకటేశ్వర వైభవం, శ్రీరామవనవాసం, పాదుకా పట్టాభిషేకం, వాసవీ కన్యక, భక్త మారుతి, సతీ అహల్య, శ్రీరామ పాదుకలు, సత్యహరిశ్చంద్ర (కాటిఘట్టం) శ్రీనాధ కవిసార్వభౌమ, పద్మావతి వైభవం లాంటి గొప్ప నాటికల్లో ప్రధాన పాత్రలతో అలరించారు. ప్రతి పాత్రను అలవోకగా పండిస్తూ స్టేజీపై తాను వేసిన పాత్రలో ప్రేక్షకులు గుర్తించుకునేలా ప్రదర్శించారు. దీంతో ఆరు రాష్ట్రాల్లో స్టేజీలపై ప్రదర్శించిన ప్రతి పాత్రకు అక్కడి ప్రజలు జేజేలు కొట్టారు. అభినందనలు తెలిపారు.

ప్రముఖులతో ప్రశంసలు

హైదరాబాదులో జరిగిన తెలుగు ఆత్మ గౌరవ దినోత్సవంలో నందినాటక ఉత్సవాల్లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. 2005లో తిరుపతిలో జరిగిన జాతీయ స్వర్ణోత్సవాల్లో భక్తమారుతి పాత్రను ప్రదర్శించినప్పుడు అప్పటి ఉమ్మడి రాష్ట్ర స్పీకరు కిరణ్‌కుమార్‌రెడ్డి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి దాసరి నారాయణ రావు చేతుల మీదుగా ప్రశంసలు, నేషనల్ అవార్డులు అందుకున్నారు. అలాగే 1994లో ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రముఖులచే సత్కారాలు అందుకున్నారు. 2002లో కడపలో సౌజన్య కళామండలిచే కడప రత్న అవార్డు, 2004లో అప్పటి కలెక్టరు జయేశ్‌రంజన్ చేతుల మీదుగా కడప ప్రతిభా అవార్డు, 2012లో ప్రొద్దుటూరులో జరిగిన స్వామిక్రియేషన్స్ వారితో రాయలసీమ కళారత్న అవార్డు, 2014లో బళ్లారిలో జరిగిన నాటకోత్సవంలో బళ్లారి రాఘవ అవార్డును, 2015లో అప్పటి సుప్రీంకోర్టు జడ్జి శేషసాయి చేతుల మీదుగా పౌరాణిక నట బ్రహ్మ అవార్డులు అందుకున్నారు. అలాగే అదే ఏడాది విజయవాడ మానస సాహిత్య సాంస్కృతిక అకాడమీలో అక్కినేని పురస్కారం కూడా అందుకున్నాడు. 2021లో నటకళారత్నగా 2022లో జిల్లా కలెక్టరు విజయరామరాజు చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. 2024 ఆగష్టు 9న ఎర్రగుంట్లలో ప్రముఖుల చేతులో రజత హస్త కంకణాన్ని, సత్కారాన్ని అందుకున్నాడు. ఇవే కాక నాటి మాజీ ముఖ్యమంత్రి రోశయ్య, గవర్నరు వెంకటసుబ్బయ్య, కొప్పర్తి సుబ్బారావు వంటి ప్రముఖుల ద్వారా ప్రశంసలు అందుకున్నాడు.

ఎస్‌బీఐలో నాలుగు సార్లు అవార్డులు

చెన్నూరు స్టేట్‌బ్యాంకులో అసిస్టెంటు మేనేజరుగా పనిచేసిన ఆయన తన 25 ఏళ్ల సర్వీసును చెన్నూరు ఎస్‌బీఐలోనే గడిపారు. గురువు ఆళ్లగడ్డ శ్రీనివాసులు (ఆయన ఘంటసాల జతలో అలరించారు) ఆధ్వర్యంలో నటనలో తీర్చిదిద్దబడ్డ నాగన్న హైదరాబాదులో ఎస్‌బీఐ ఎండీ చేతుల మీదుగా 1986, 2009లో ఘన సన్మానాలు అందుకున్నారు. నేటికీ కళామతల్లి ముద్దుబిడ్డగానే రాణిస్తూ ఊపిరి ఉన్నంత వరకు కళామతల్లి సేవ చేస్తూనే ఉంటానన్నారు. వృత్తిలో ఎంత ఒత్తిడిలో ఉన్నా నాటకరంగాన్ని అలవోకగా పండించడం, ఐదువేలకు పైగా నాటకాల్లో పాల్గొనడం ఆయన కళాతృష్ణకు నిదర్శనం. అలాంటి వ్యక్తి చెన్నూరులో ఉండడం గర్వకారణమని స్థానికులు చెబుతుంటారు.

కళామతల్లే నా ప్రాణం



ఊపిరి ఉన్నంత వరకు కళామతల్లికి సేవ చేస్తునే ఉంటా. 70 ఏళ్ల వయసులో ఎవరు ఏ నాటక విషయంలో ఎక్కడికి పిలిచినా వెళుతునే ఉన్నా. బ్యాంకు ఉద్యోగిగా సర్వీసులో ఎంత సేవ చేసినా కళామతల్లి సేవలో ఉన్న ఆనందం మరేదాంట్లోనూ నాకు లేదనిపిస్తుంది. అందుకే ఆ తల్లికి నేను ఎప్పటికీ చిన్నబిడ్డనే. నా శ్వాస, ధ్యాస అంతా కళామతల్లి వద్దనే. ఊపిరి ఉన్నంత వరకు కళాకారుడిగానే జీవిస్తా.

-నాగన్న, కళాకారుడు, చెన్నూరు







నాటి సీఎం చంద్రబాబు, అప్పటి స్పీకరుగా ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డి, అప్పటి కడప కలెక్టరు శశిభూషణ్ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న నాగన్న

మధ్యవర్తిత్వంతో సంబంధాలను పునరుద్ధరించవచ్చు

● కడప ప్రత్యేక న్యాయమూర్తి హేమస్రవంతి జానకీరాం

రైల్వేకోడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంతో విచ్ఛిన్నమైన సంబంధాలను పునరుద్ధరించవచ్చని కడప ప్రత్యేక న్యాయమూర్తి హేమస్రవంతి జానకీరాం తెలిపారు. శనివారం రైల్వేకోడూరు న్యాయస్థానం ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు న్యాయవాదులకు ఒక్క రోజు పాటు మధ్యవర్తిత్వం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక కేసుకు సంబంధించి ఏ దశలోనైనా న్యాయవాదులు మధ్యవర్తిత్వం ప్రారంభించవచ్చని తెలిపారు. మధ్యవర్తిత్వం వలన ఇరు పార్టీలకు సయోధ్య ఏర్పడుతుందన్నారు. భార్య భర్తల కేసులు, ప్రామిసరీనోటు (చెక్‌బౌన్స్ కేసు) వంటి కేసులను సామరస్యంగా పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు. వారి మధ్య విద్వేషాలను తొలగించి, ఇరువురు స్నేహ పూర్వకంగా మసలుకోవడానికి న్యాయవాదులు సహాయపడాలని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహారావు, సీనియర్ న్యాయవాదులు వెంకట్రామరాజు, రెడ్డయ్యనాయుడు, మధుసూదన్‌రావు, సురేష్‌రెడ్డి, చెంచు రామయ్య, శంకరయ్యనాయుడు, మహిళా న్యాయవాది అంబికా తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి హేమస్రవంతి జానకీరాం

హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలగాలి

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

● గొడవలు జరిగితే కఠిన చర్యలు : ఎస్పీ

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలిగి ఎటువంటి గొడవలకు చోటు ఇవ్వరాదని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంత్రితో పాటు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్‌ల ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న గొడవలను దృష్టిలో ఉంచుకుని హిందూ, ముస్లింలతో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. ఎటువంటి గొడవలకు తావివ్వకుండా హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలగాలన్నారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో ఎటువంటి గొడవలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో కొంతమంది ఆకతాయిలు గొడవలు సృష్టిస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని, రాత్రి 10.30 గంటల తర్వాత అత్యవసర పరిస్థితుల్లో తప్ప అనవసరంగా ఎవరూ బయట తిరగకూడదన్నారు. రాయచోటి పట్టణం ప్రశాంత వాతావరణంలో ఉండేందుకు సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిఘా పెడతామన్నారు. పట్టణంలో ఎటువంటి చిన్న సమస్య కూడా తలెత్తకుండా ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఉండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ పుల్లారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

అవాస్తవాలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

రాయచోటిటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో రెండు వర్గాల మధ్య జరిగిన వివాదాన్ని కొందరు ఆకతాయిలు అసత్య ప్రచారాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇప్పటికే 150 మంది అసాంఘిక శక్తులను డ్రోన్ టెక్నాలజీ, ఇతర అత్యాధునిక, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గుర్తించామన్నారు. వీరిపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమించినట్లు ఎస్పీ తెలిపారు. సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా దుష్ప్రచారం చేసే సంఘవిద్రోహ శక్తులు, ప్రజలను రెచ్చగొట్టే వారిపై నిఘాఉంచామని తెలిపారు.


యల్లంరాజుచెరువు అందాలు, అలుగు పారుతున్న దృశ్యం



గల..గల..పారుతూ..

ఇటీవల కురిసిన వర్షాలకు నదులు, చెరువుల అలుగులు గల గలా పారుతున్నాయి. ఆయా ప్రాంతాలు పచ్చని చెట్లతో కనువిందు చేస్తున్నాయి. పక్షుల కిలకిలలు, అలుగుల వద్ద చిన్నపిల్లల కేరింతలు, కొత్త నీరు వచ్చిన చేప పిల్లల పులకరింతలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. సాయంత్రమైతే మరింత ఆహ్లాదకరంగా వాతావరణం ఉంటోంది. రైల్వేకోడూరు నియోజక వర్గంలోని చిట్వేలి మండలం యల్లంరాజుచెరువు, చెక్‌డ్యాంలు, చిట్వేలి-రాపూరు మార్గం మధ్య నేల, నీరు, ఆకాశం కనిపించే అందాలు చూడవచ్చు.

- రైల్వేకోడూరు (ఆంధ్రజ్యోతి)



నింగి, నీరు కనిపించే విధంగా ఉన్న అందమైన దృశ్యం

చదువులమ్మ ఒడి.. ప్రభుత్వ బడి

● ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యార్థుల ప్రతిభ

● అడ్మిషన్లూ 1500 పైనే

● మార్కుల్లో ప్రతి ఏటా టాపే

బద్వేలు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేలకు వేలు ఫీజులు చెల్లిస్తే తమ పిల్లలకు మంచి విద్య అందుతుందని తల్లిదండ్రులు భావిస్తుంటారు. కొంతమంది స్తోమత లేకపోయినా తమ పిల్లలకు మంచి విద్య అందించాలనే తాపత్రయంతో ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులను చేర్పిస్తుంటారు. కానీ ప్రైవేటుకు ఏమాత్రం తీసిపోని విధంగా పట్టణంలోని కన్యకాపరమేశ్వరి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పేరు తెచ్చుకుంటోంది. మంచి విద్యనందిస్తూ చదువులమ్మ ఒడిగా ప్రశంసలు పొందుతోంది. ఇక్కడి విద్యార్థులు గత ఐదేళ్లుగా పదవ తరగతి ఫలితాల్లో ప్రైవేటు పాఠశాలలతో పోటీపడి మంచి మార్కులు సాధిస్తున్నారు. దీంతో పట్టణంలో బెస్ట్ పాఠశాలగా పేరు గాంచింది. 1918లో ప్రారంభమైన ఈ పాఠశాల.. ప్రత్యేక తరగతులు, అత్యుత్తమ శ్రద్ధ, ఉత్తమ బోధనతో విద్యను అందిస్తోంది. అటు చదువులోనూ, ఇటు ఆటల్లోనూ విద్యార్థులు తమ ప్రతిభను కనబరుస్తున్నారు.



బద్వేలు బాలుర ఉన్నత పాఠశాల

విద్యార్థుల సంఖ్యలోనూ టాప్

కొన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ ఎక్కువమంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళుతుంటారు. కానీ బద్వేలు పట్టణంలోని కన్యకా పరమేశ్వరి బాలుర ఉన్నత పాఠశాలలో మాత్రం ఇందుకు భిన్నంగా విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. గత నాలుగేళ్ల క్రితం నుంచి అడ్మిషన్ల సంఖ్య జోరందుకుంటోంది. ప్రస్తుతం 1630 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.



ఆటల పోటీలలో మెడల్స్ సాధించిన విద్యార్థులు (ఫైల్)

చదువుతో పాటు, ఆటల పోటీల్లోనూ

పది ఫలితాల్లో ప్రైవేటు పాఠశాలలు తమ విద్యార్థులు టాప్‌లో నిలిచారంటూ ఊదరగొడుతుంటారు. బద్వేలు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు కూడా వారితో పోటీపడుతున్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో 586 మార్కులు సాధించారు. 50 మందికి పైగా 500 పైబడి సాధించి జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన పాఠశాలగా పేరొచ్చింది. గత నాలుగేళ్ల నుంచి ప్రతి ఏడాది పదిలో మంచి మార్కులు సాధిస్తున్నారు. చదువులోనే కాకుండా ఆటల పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి వాలీబాల్, ఖోఖోలో విద్యార్థులు అనేక బహుమతులు సాధించారు.

పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



పాఠశాలలో ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. ఇక పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఉదయం 8 గంటలకు, సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేస్తున్నాం. ఈసారి కూడా మంచి మార్కులు సాధించి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నాం.

- జి.వెంకటసుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, బద్వేలు



వాలీబాల్ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు (ఫైల్)

ప్రభుత్వాస్పత్రి వద్ద ఘర్షణ

● ఇన్‌స్టాగ్రాం పరిచయం తెచ్చిన తంటా... కొట్టుకున్న ఇరువర్గాలు

మదనపల్లెఅర్బన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రాంలో పరిచయంతో తన భార్యకు ఓ యువకుడు ఫోన్‌లు చేస్తున్నాడని ఆగ్రహించి ఆ మహిళ భర్త ఆ యువకుడిపై దాడి చేసి కొట్టాడు. వివరాలిలా ఉన్నాయి. మదనపల్లెకు చెందిన ఓ యువకుడు (21)కి ఇన్‌స్టాగ్రాంలో మదనపల్లెకు చెందిన ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. దీంతో వారిద్దరూ మెసేజ్‌లు పెట్టుకోవడంతో పాటు ఫోన్‌లో కూడా మాట్లాడుకుంటుండేవారు. ఈ విషయం ఆమె భర్తకు తెలియడంతో అతను ఆమెను వారించాడు. ఈ నేపధ్యంలో శనివారం సాయంత్రం మదనపల్లె ప్రభుత్వాస్పత్రి వద్ద ఆ మహిళతో ఆ యువకుడు మాట్లాడుతుండగా అక్కడికి వచ్చిన ఆ మహిళ భర్త వారిద్దరిని చూసి ఆగ్రహంతో ఆ యువకుడిపై దాడి చేశాడు. దీంతో వారిద్దరూ ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో ఆ యువకుడు గాయపడగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిసింది.



జిల్లా ఆస్పత్రి వద్ద గొడవ పడుతున్న ఇరువర్గాలు

వామ్మో..వరికోతలు



- వరికోత యంత్రాల యజమానులు సిండికేట్
- తమిళనాడు హార్వెస్టర్లు రాకుండా అడ్డగింపు
- గంటకు రూ.3500 చార్జీలు
- కూలీల కొరతతో ఇక్కట్లు
- గత్యంతరం లేక హార్వెస్టర్లను ఆశ్రయిస్తున్న రైతులు
- కుదేలవుతున్న అన్నదాతలు

కడప రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరికోతలు రైతులకు భారంగా మారాయి. కూలీలంతా ఉపాధిహామీ పథకం పనుల వైపు మొగ్గు చూపుతుండడంతో కోతలకు కూలీల కొరత అడ్డంకిగా మారింది. తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు వరికోత యంత్రాల(హార్వెస్టర్ల)ను ఆశ్రయిస్తున్నారు. దీంతో హార్వెస్టర్లకు రైతుల నుంచి డిమాండ్ అధికంగా ఉండడంతో యజమానులు సిండికేట్ అయ్యారు. అమాంతంగా ధరలను పెంచేశారు. చైన్ హార్వెస్టర్‌కు గంటకు రూ.3500లు, టైర్ల హార్వెస్టర్‌కు రూ.2500 పైబడి తీసుకుంటున్నారు. ఒక ఎకరా వరికోతకు రెండు గంటల సమయం పడుతుండడంతో రైతు దాదాపు రూ.7000లు చెల్లించాల్సి వస్తోంది. ఇది రైతుకు అదనపు భారం అవుతోంది. గత ఏడాది గంటకు చైన్ హార్వెస్టర్‌కు 2800 నుంచి రూ.3000లు, టైర్ల హార్వెస్టర్‌కు అయితే 1800 నుంచి 2000ల వరకు చార్జీలు ఉండేవి. అయితే ఈ ఏడాది ఉన్నఫలంగా హార్వెస్టర్ల యజమానులు ధరలను పెంచేశారు. కారణం గతంలో వరికోత సీజన్‌లో తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాల నుంచి వరికోతయంత్రాలు వచ్చేవి. ఇవి మన జిల్లాలోని హార్వెస్టర్ల ధరల కన్నా రూ.300 నుంచి 500 వరకు తక్కువ ధరతో వరికోతలను కోసేవారు. అయితే ప్రస్తుత సీజన్‌లో ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న హార్వెస్టర్లను ఇక్కడి హార్వెస్టర్ల యజమానులు రాకుండా చేసి... సిండికేట్‌గా మారి అధిక ధరలను నిర్ణయించారు. దీంతో రై చేసేదిలేక అధిక ధరలను చెల్లించి వరి కోతలను కొనసాగిస్తున్నారు.

ముమ్మరంగా వరికోతలు

జిల్లాలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. 2024 ఖరీఫ్‌లో జిల్లాలో కేసీ కెనాల్ ఆయకట్టుతో పాటు, బోరు బావులు, నదీ పరివాహక ప్రాంతాలతో పాటు ఇతర నీటి వనరుల కింద 28వేల హెక్టార్లకు పైగా రైతులు వరి పంటను సాగుచేశారు. ఇప్పటికి దాదాపు 12వేల హెక్టర్ల వరకు వరికోతలు జరిగాయి. ఇంకా 14వేల హెక్టార్లు పైబడి వరికోతలు జరగాల్సి ఉంది. ఇందులో బోరుబావులు, ఇతర నీటి వనరుల కింద సాగుచేసిన వరికోతలు నవంబర్ మధ్యస్థం నుంచి ప్రారంభమయ్యాయి. కేసీ కెనాల్ ఆయకట్టు కింద కాస్త ఆలస్యంగా వరి పంట సాగుచేయడంతో డిసెంబర్ మధ్యస్థం నుంచి జనవరి వరకు కోతలు కొనసాగనున్నాయి. ప్రస్తుతం 40 శాతం వరకు వరికోతలు పూర్తయ్యాయి. మరికొన్ని గ్రామాల్లో సాగుతున్నాయి. జిల్లాలో హార్వెస్టర్ల సంఖ్య తక్కువగా ఉండడంతో అదే అదునుగా భావించిన కొందరు యజమానులు చార్జీలు అమాంతం పెంచారు. గత ఏడాది టైర్ల హార్వెస్టర్‌కు గంటకు రూ.1600 నుంచి 1800ల వరకు వసూలు చేయగా ప్రస్తుతం రూ.2,000 నుంచి రూ.2500 వరకు డిమాండ్ చేస్తున్నారు. దీనికితోడు ఫెంగల్ తుఫాను ప్రభావం కొనసాగుతుండడంతో రైతులు వర్షం నుంచి పంటను కాపాడుకోవడానికి తాపత్రయ పడుతున్నారు. ఈ అవకాశాన్ని చైన్ హార్వెస్టర్లు ఆసరాగా చేసుకుని అందినకాడికి దండుకుంటున్నారు. ఒక గంటలకు రూ.3500 వరకు వసూలు చేస్తున్నారు. అయినా గత్యంతరం లేక హార్వెస్టర్‌తో కోయిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యయం పెరిగింది



వరి సాగుకు ఏటేటా వ్యయం పెరుగుతోంది. నేను 1.50 ఎకరాలలో వరిపంట సాగుచేశాను. తుఫాన్ ప్రభావంతో పంట దెబ్బతింటుందని 4 రోజుల క్రితమే చైన్ హార్వెస్టర్‌తో వరి పంటను కోయించాను. గత ఏడాది గంటకు చైన్ హార్వెస్టర్ అద్దె 2800 నుంచి రూ.3000లు ఉండగా ఇప్పుడు అదనంగా రూ.500లు పెంచారు. అయినా తప్పడం లేదు.

- అనగూరి హరినాథరెడ్డి, పొలుగారిపల్లె, సీకేదిన్నె మండలం

స్థానికంగా యంత్రాలు లేక...



వరి కోతలు ఒక్కసారిగా వచ్చాయి. కూలీల కొరత ఎక్కువగా ఉంది. వరికోత యంత్రాలకు డిమాండ్ ఎక్కువైంది. పండిన పంటను ఏదోక విధంగా కోత కోయించి సొమ్ము చేసుకునేందుకు వరికోత యంత్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ యంత్రాలు స్థానికంగా లేకపోవడంతో దూరప్రాంతాల నుంచి తెప్పించుకోవాల్సి వస్తోంది. దీంతో వారు అడిగినంత చార్జీలు చెల్లించక తప్పడం లేదు.

- మునెయ్య, వెంకటగారిపల్లె, సీకే దిన్నె మండలం

కూలీలు దొరకడం లేదు



నేను రెండున్నర ఎకరాలలో వరి పంటను సాగుచేశాను. ఒక పక్క వరి కోతలకు కూలీలు దొరకడం లేదు. ఇప్పుడేమో వర్షం పట్టుకుంది. బాడుగలు ఎక్కువ చెబుతున్నా చైన్ హార్వెస్టర్‌తో కోతలు కోయించుకుంటున్నాం. ఒక ఎకరా వరికోతకు రూ.3500లు చెల్లించాను. ఇలా దాదాపు ఐదు గంటలు పైనే సమయం పట్టడంతో రూ.10వేలు వరకు చెల్లించాల్సి వచ్చింది.

- ఎ.రవిశంకర్‌రెడ్డి, పొలుగారిపల్లె, సీకేదిన్నె మండలం

రౌడీషీటర్ పప్పీ హత్య కేసులో నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భక్తవత్సలం

ప్రొద్దుటూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలు మనసులో పెట్టుకుని పప్పీ అలియాస్ కొప్పుల రాఘవేంద్రను ఎనమల లోకేష్‌రెడ్డి మరో ఇద్దరు కలిసి హత్య చేసినట్లు డీఎస్పీ భక్తవత్సలం వెల్లడించారు. స్థానిక వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఆవరణలో శనివారం హత్యకేసుకు సం బంధించి వివరాలు తెలిపారు. లోకేష్‌రెడ్డికి పప్పీకి మధ్య స్నేహంతో పాటు మనస్పర్థలు ఉండేవి. ఈ నేపథ్యంలో డిసెంబరు 1న ఆదివారం లోకేష్‌రెడ్డికి పప్పీ ఫోన్ చేసి డబ్బులు అడిగాడు. డబ్బులు లేవు కావాలంటే బీజీఆర్ లాడ్జికి వస్తే మందు పార్టీ ఇస్తానని లోకేష్ రెడ్డి ఆఫర్ చేశాడు. ఆదివారం రాత్రి బీజీఆర్ లాడ్జికి పప్పీ వెళ్లగా.. అప్పటికే లాడ్జిలోని రూములో లోకేష్‌తో కలిసి సునీల్‌రెడ్డి, ముజీబ్‌లు మందు తాగుతూ వున్నారు. పప్పి వచ్చిన తర్వాత అందరూ కలిసి మందు తాగుతుండగా మాటామాటా పెరిగి నీవెంత అంటే నీవెంత అంటూ బీరాలకు పోయి ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో పప్పీ రెచ్చిపోయి వారి మీద దాడి చేయడంతో ఆ ముగ్గురు కలిసి పప్పీని మందుబాటిల్‌తో తలపై కొట్టారు. దీంతో పప్పీ స్పృహతప్పి కింద పడిపోయాడు. దాడి తర్వాత పప్పీ బతికితే మళ్లీ తమ ప్రాణాలకు ఎక్కడ ముప్పు ఉం టుందోనని పప్పీ కాళ్లను అదిమిపట్టి గొంతునులిమి చంపినట్లు నింది తులు విచారణలో వెల్లడించారని డీఎస్పీ తెలిపారు. కాగా, నిం దితులు ముగ్గురు ఆర్టీపీపీ రోడ్డులో ఉండగా వన్‌టౌన్ సీఐ రామ క్రిష్టారెడ్డి, ఎస్ఐ సంజీవరెడ్డిలు అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

మంగంపేటలో దారుణ హత్య



ఓబులవారిపల్లె, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): మంగంపేట గ్రామంలో గుట్ట ఆంజనేయులు(55) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి దారుణ హత్యకు గుర య్యారు. గ్రామస్థుల వివరాల మేర కు.. మృతుడు ఆంజనేయులు వికలాంగుడు కాగా ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు రమణ, వెంకటేశ్, కుమార్తె సుభాషిణి ఉన్నారు. పెద్ద కుమారుడుకి పెళ్లి అయ్యింది. శుక్రవారం రాత్రి నిద్రిస్తున్న అతని తలపై పదునైన ఆయుధంతో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు చేరవేయగా రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు, ఓబులవారిపల్లె ఎస్ఐ మహేష్‌లు సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించి.. అనుమానాస్పదంగా ఉండడంతో కేసు నమోదు చేసి పలు కోణాల్లో దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. హత్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తొమ్మిది మందిపై కేసులు నమోదు

చాపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భద్రిపల్లెలో జరిగిన ఘర్షణకు సంబంధించి శనివారం తొమ్మిది మందిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇంటి వద్ద ఆటో నిలిపే విషయమై శుక్రవారం భద్రిపల్లె గ్రామానికి చెందిన బండి రమేష్, మోకాటి ఓబులేసులు ఘర్షణకు పాల్ప డ్డారు. దీంతో ఇరువర్గాల వారు ఒకరిపై మరొకరు కట్టెలు, రోకలి బడెలతో దాడులకు పాల్పడ్డారు. దీంతో ఓబులేసు, ఓబన్న, వెలుగమ్మ, రమేష్ సూర్యం, శ్యామల, అనూరాధలకు గాయాలయ్యాయి. ఇరు కుటుంబాల ఫిర్యాదు మేరకు తొమ్మిది మందిపై కేసులు నమోదు చేశామన్నారు.

స్కూటర్‌ను ఢీకొన్న కారు... ఇద్దరికి తీవ్రగాయాలు





ప్రమాదంలో గాయపడిన నారాయణరెడ్డి, రామసుబ్బమ్మ

కాశినాయన డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం వద్ద ప్రధాన రహదారిపై శనివారం స్కూటర్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వివరాల మేరకు... లింగారెడ్డిపల్లెకు చెందిన అంబవరం నారాయణరెడ్డి, కొత్తపల్లె రామసుబ్బమ్మలు స్కూటర్‌పై ఉప్పలూరు గ్రామానికి వెళుతుండగా... అదే సమయంలో పోరుమామిళ్ల నుంచి కలసపాడు వస్తున్న కారు ఓబుళాపురం గ్రామసమీపంలో స్కూటర్‌ను వెనుక నుంచి ఢీకొంది. దీంతో రామసుబ్బమ్మ, నారాయణరెడ్డిలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. గుర్తించి స్థానికులు 108కు సమచారం అందించి పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు.

కారు, ఆటో ఢీ : ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడ్డ మునెమ్మ

ముద్దనూరు డిసెంబరు7 (ఆంధ్ర జ్యోతి):మండల పరిధి పులివెందుల రహదారిలోని పుల్లేరు వంక సమీపంలో శనివారం రాత్రి కారు ఆటో ఢీకొన్న సంఘటనంలో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి.స్థానికుల సమాచారం మేరకు వివరాలు... కమ్మవారిపల్లె గ్రామానికి చెందిన అగ్గిరాజు(60),మునెమ్మ(55)లు ఆటో వెళ్ళి ఫ్యాన్సీ సామానులు వ్యాపారం చేస్తుంటారు. పులివెందుల వైపు నుంచి ఆటో లో వస్తున్నారు. జమ్మలమడుగు నుంచి ధర్మవరంకు కారు వెళుతుంది.పుల్లేరు వంక సమీపంలో రోడ్డుకు ఏర్పడ్డ పెద్ద గుంత వద్దకు రాగానే గుంతను తప్పించబోయి కారు ఆటో ఢీకొన్నాయి.దీంతో ఆటోలో ఉన్న అగ్గిరాజు, మున్నెమ్మకు గాయాలయ్యాయి. ఆటో బోల్తాపడగా, కారు ముందుభాగం పూర్తిగా దెబ్బతింది. వెంటనే ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వ్యాను ఢీకొనడంతో ఒకరికి..



గాయపడ్డ వ్యక్తి రఘురామయ్య

పోరుమామిళ్ల, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): పోరుమామిళ్ల సమీపంలోని మల్లక తవ వద్ద మినీ లగేజీ వ్యాను స్కూటరును ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గోపవరం మండలం లెక్కలూరి గ్రామానికి చెందిన గాలి రఘురామయ్య కాశినాయన మండలంలో ఉన్న తన కూతురు వద్దకు వెళుతుండగా మల్లకతవ మలుపులో వ్యాను అదుపు తప్పి స్కూటరును ఢీకొంది. సమాచారం తెలిసిన ఎస్ఐ కొండారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ వ్యక్తిని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గోపరాజుపల్లెలో ఘర్షణ... ఒకరికి గాయాలు



పెండ్లిమర్రి, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గోపరాజు పల్లెలో శని వారం ఇరువర్గాల వారు ఘర్షణ పడటంతో నంద్యాల సుబ్బరాయుడు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు జరిగాయి. ఈ నేపథ్యంలో పాతకక్షల కారణంగా ఇరువర్గాల వారు ఆధిపత్యం కోసం ఈ ఘర్షణకు పాల్పడినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

వేముల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేముల ప్రధాన రహదారిపై స్థానిక వెంకటేశ్వరస్వామి గుడి వద్ద ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. తొండూరు మండలం మడూరు గ్రామానికి చెందిన మిద్దె విశ్వనాథ్ తన బంధువుల గ్రామమైన గొందిపల్లెకు పులివెందుల నుంచి బైకుపై వస్తుండగా వేములలో ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

టీచర్ ఎజాజ్ కుటుంబానికి న్యాయం చేయాలి

- ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు

కడప కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటి ఉర్దూ హైస్కూలులో ఫిజికల్ సైన్స్ మాస్టర్ ఎజాజ్ అహమ్మద్ విద్యార్థుల దాడిలో మరణించడం విచారకరమని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దాడికి పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఏపీ ఎన్జీవో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.ప్రసాద్, జిల్లా కార్యదర్శి రవికుమార్‌లు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా ఎన్జీవో కార్యాలయంలో వారు మాట్లాడుతూ పాఠశాల దశలోనే విద్యార్థుల ఆలోచన తీరు దారుణంగా మారడం బాధాకరమన్నారు. ఇలాటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు మేలు జరిగేలా ప్రభుత్వం ప్రజా ప్రాతినిధ్యం చట్టం రూపొందించా లన్నారు. టీచర్ ఎజాజ్ కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే జిల్లాకు వచ్చిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలసి టీచర్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో ఎన్జీవో సంఘం నేతలు బాలపుల్లయ్య తమ్మారెడ్డి, కె.చిన్నయ్య, శైలే శ్వరరెడ్డి, శ్రీనివాసన్, నాగార్జున, పద్మనాభం, కాటమయ్య, జానకి తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలి

- జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి



కేంద్ర కారాగారంలో భోజనాలను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఖైదీల ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం మహిళ, పురుషుల కేంద్ర కారాగారాలతో పాటు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ఆమె విజిట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖైదీలు ఉచిత న్యాయసహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి కేసుల వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. జైలు పరిసరాలను, వంట గదులను, వసతి గదులను, రిజిస్టర్లను పరిశీలించి తగు సూచనలను, సలహాలు ఇచ్చారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయసహాయం, లీగల్ సర్వీస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

పార్లమెంటులో మహిళలకు సమాన ప్రాధాన్యతనివ్వాలి

- ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త కల్పనా కన్నాభిరాన్



కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో మహిళలకు సమాన ప్రాధాన్యత కల్పించడం ద్వారా లింగ సమానత్వం సాధ్యమవుతుందని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త, కౌన్సిల్ ఫర్ సోషల్ డెవల్‌మెంటు న్యాయవిద్వాంసులు ప్రొఫెసర్ కల్పనా కన్నాభిరాన్ అన్నారు. వైవీయూ అంతర్గత ఫిర్యాదుల కమిటీ, లైంగిక వేధింపుల నిరోధక కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో జండర్ జస్టిస్ అండ్ కానిస్టిట్యూషన్ ఆఫ్ ఇండియా పేరుతో శనివారం వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంప్రదాయక సామాజిక ఆలోచన సమాజంలో లోతుగా పాతుకుపోతున్నట్లయితే లింగ సమానత్వ లక్ష్యాలను సాధించదన్నారు. ముందుగా అది కుటుంబంలోని పిల్లల నుంచి సారస్కృతిక అభ్యాసాలు స్వీయ స్పృహ, ప్రవర్తన ద్వారా రావాలని దిశ నిర్దేశం చేశారు. ఆర్టికల్ 14, 15, 106వ సవరణ చట్టం వంటి వివిధ ఆర్టికల్స్ ద్వారా లింగ న్యాయాన్ని ప్రోత్సహించడానికి రాజ్యాంగం ఒక ఫ్రేమ్‌వర్క్‌ను అందించి సమానత్వం అనే ఆలోచనను ప్రతిబింబిస్తుందన్నారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్టారెడ్డి మాట్లాడుతూ సమాన అవకాశాలు కల్పించడం ద్వారా స్త్రీ పురుషుల మధ్య అసమానతలు తొలగించవచ్చన్నారు. అనంతరం రిజిస్ట్రారు పద్మ, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి వెబ్‌నార్ కన్వీనరు ప్రొఫెసరు అనిత మాట్లాడారు.

వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం రాజమార్గం

- మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి



మాట్లాడుతున్న మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వరావు

కడప రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్తం రాజ మార్గం లాంటిదని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వరావు పేర్కొన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ సభ్యులకు, న్యాయవాదులకు మధ్యవర్తిత్వం అనే అంశంపై సెన్సిటైజేషన్ ప్రోగ్రామ్‌ను శనివారం ఉదయం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అనేది ఒక ప్రక్రియ అని... ఇది వివాదాలను పరిష్కరిస్తున్న మంచి పద్ధతి అన్నారు. ఖర్చు, సమయాన్ని ఆదా చేస్తుందన్నారు. మధ్యవర్తిత్తం వలన వ్యక్తిగత సంబంధాలు చెడవన్నారు. మధ్యవర్తిత్వం నియమాలు 2007, సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వము, ప్రాజెక్టు కమిటీ నిబంధనలు 2015, మధ్యవర్తిత్వ చట్టం 2023, సివిల్ ప్రొడక్షన్ కోడ్ 1908, మధ్యవర్తిత్వం, రాజీ చట్టం 1996, మీడియోషన్ యాక్టు 2023 తదితర అంశాలను వివరించారు.

లైంగిక వేధింపుల నిరోధక చట్టం పై వర్క్‌షాపు

లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013, లింగ సున్నితత్వం తదితర అంశాలపై బార్ అసోసియేషన్ సభ్యులకు న్యాయవాదులకు సాయంత్రం వర్క్‌షాపును నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వరావు, డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్‌లు మాట్లాడుతూ మహిళలు పనిచేసే ప్రదేశంలో లైంగిక వేధింపులకు గురైనపుడు పోష్ చట్టం 2013 కింద ఫిర్యాదు చేయవచ్చన్నారు. పోష్ చట్టంలోని సెక్షన్ 12(3) ప్రకారం పేర్కొన్న సంఘటనపై ఇతర చట్టాల వర్తింపుతో పాటు పేర్కొన్న శ్రామిక మహిళకు పరిహారం కోసం అపరాధుల జీతం తీసివేయడం జరుగుతుందన్నారు. పోష్ చట్టంలోని సెక్షన్ (3) గురించి వివరించారు.

కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షులు బి.గుర్రప్పనాయుడు, మీడియోషన్ న్యాయవాది చంద్రకాంతమ్మ, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

చిత్రం చెప్పిన సమస్య



ఇదేదో సాదాసీదా ఊర్లో రోడ్డు అనుకుంటే పొరపాటే.. జిల్లా కేంద్రమైన కడప నగరంలో రోడ్డు. ఎర్రముక్కపల్లె నుంచి ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లే ప్రధాన రహదారి. రోడ్డంతా గుంతలే.. వర్షాకాలంలో ఆ గుంతల లోతు తెలియక జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎర్రముక్కపల్లె నుంచి బాలాజీనగర్‌కు వెళ్లాలన్నా, ఐటీఐ సర్కిల్, చెమ్మమియా పేటకు వెళ్లాలన్నా ఇదే దగ్గరిదారి. ఇక్కడ నిత్యం మురుగు నీరు ప్రవహిస్తూ ఉంటోంది. ఈ దారిన వెళ్లాలంటే వాహనదారులు అవస్థలు పడుతున్నారు.ఈ సమస్యను అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదని ప్రజలు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

-కడప ఎర్రముక్కపల్లె, (ఆంధ్రజ్యోతి)

చదువుతో పాటు సత్ప్రవర్తన నేర్పుదాం

● ప్రభుత్వ బడుల్లో సంక్రాంతికి ముందే సంబరాలు ● తల్లిదండ్రులు, విద్యార్థులతో పాఠశాలలు కళకళ

పులివెందుల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఏర్పాటు చేసింది. ప్రభుత్వం లక్ష్యానికి తగ్గట్లు కార్యక్రమం విజయవంతమైంది. బడుల ముందు రంగవల్లులు, తోరణాలతో విద్యార్థుల తల్లిదండ్రులకు స్వాగతం పలికారు. తల్లిదండ్రుల సమావేశం విజయవంతంగా నిర్వహించారు. ఆ వివరాల్లోకి శితే... మంత్రి నారా లోకేశ్ ఆలోచనతో శనివారం మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి ఆయా బడుల వద్ద పండుగ వాతావరణం నెలకొంది. బడి ప్రహరీ గేటు వద్ద రంగవల్లులతో విద్యార్థుల తల్లిదండ్రులకు స్వాగతం పలికారు. మరోపక్క పచ్చతోరణాలతో పాఠశాలలను అలంకరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల ప్రోగ్రెస్‌తో పాటు చదువుతున్న తీరును తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థుల ప్రోగ్రెస్‌తో పాటు అక్కడికి వచ్చిన తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభచూపిన విద్యార్థుల తల్లిదండ్రులకు బహుమతులు అందించారు. అలాగే పాఠశాలలో చదువుకుని ఉన్నత చదువులు చదువుకొనే వారిని మీటింగ్‌కు పిలిపించి వారి అనుభవాలను తెలుసుకున్నారు. ముఖ్య అతిథి ద్వారా విద్యార్థులకు సందేశాన్ని అందించారు.




సింహాద్రిపురంలో పాఠశాలను రంగవల్లులతో ముస్తాబు చేసిన దృశ్యం... పులివెందులలో టగ్ ఆఫ్ వార్ పోటీలు

గుణాత్మక విద్యనందించాలి

పులివెందుల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యనభ్యసించాలని పులివెందుల ఇన్‌చార్జి ఆర్డీఓ అనురాధ సూచించారు. శనివారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ సమావేశం స్థానిక అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఇన్‌చార్జి ఆర్డీఓ అనురాధ మాట్లాడుతూ తల్లిదండ్రులను, విద్యార్థులను ఒకేచోట చూడడం సంతోషంగా ఉందన్నారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, టీపీఓ అజయ్, కౌన్సిలర్ కిషోర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో...

కస్తూర్బా బాలికల పాఠశాల, కోవరంగుట్టపల్లి పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కోవరంగుట్టపల్లిలో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు, పాఠశాల పూర్వపు విద్యార్థులను సన్మానించారు.కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ గురుదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత, అంగడి నాగేంద్ర, రామసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి

చక్రాయపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని టీడీపీ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నా రు. శనివారం నాగులగుట్టపల్లె జడ్పీ హైస్కూల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం ప్రధానోపాధ్యాయుడు సంజీవ్‌కుమార్ జరిగింది. గండి గురుకుల పాఠశాలలో ప్రిన్సిపా ల్ సురేంద్రబాబు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రారెడ్డి, ఉపసర్పంచు దాసరి ఆంజనేయులు, రామచంద్ర, రాజశేఖర్ పాల్గొన్నారు.

పట్టుదలతోనే ఉన్నత స్థానాలకు

చెన్నూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల పట్టుదల, తల్లిదండ్రులు తమ బిడ్డలపై పెట్టే శ్రద్ధతోనే వారు ఉన్నతస్థానాలకు చేరుకోగలరని ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు, మండల ప్రత్యేక అధికారి పరిమళ జ్యోతి అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పేరెంట్స్ మీటింగ్ జరిగింది. తహసీల్దారు సరస్వతి, ఈఓఆర్డీ సురేశ్‌బాబు, ఎంఈఓ-2 సునీత, పాఠశాలప్రధానోపాధ్యాయురాలు పద్మనాభయ్య, రత్నాదేవి పాల్గొన్నారు.

నేడు తలదించుకుని చదివితే... రేపు తలెత్తుకుని జీవించగలం

కమలాపురం రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నేడు తలదించుకుని చదివితే రేపు తలెత్తుకుని జీవించగలం అని మండల స్పెషలాఫీసర్ వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ప్రిన్సిపాల్ తులశమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు విదేశాల్లో క్రీడా పోటీలు ఆడి విజయం సాధించాలన్నారు. నగర పంచాయతీ కమిషనరు జగన్నాథం, చైర్‌పర్సన్ మార్పురి మేరీ, ఎంపీడీఓ జ్యోతి, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పేరెంట్స్ సమావేశం

సికెదిన్నె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం పేరెంట్స్, టీచర్స్ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కుళాయిబాబు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గౌస్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు, తాడులాగే పోటీలు నిర్వహించి గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. మహేశ్వర్‌రెడ్డి, పీరూప్రసాద్, శంకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శోభారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు

వల్లూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడుల్లో మంచి సౌకర్యాలున్నాయని టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి అన్నా రు. స్థానిక మోడల్ స్కూలులో జరిగిన కార్యక్రమానికి టీడీపీ నాయకులు హాజరయ్యారు. వల్లూరు హైస్కూలులో ఎంపీడీఓ రఘురాం, ముఖ్యఅతిథిగా పాల్గొనగా కస్తూర్బా పాఠశాలలో వ్యవసాయాధికారిణి సాయిజ్యోతి, పెద్దపుత్త హైస్కూలులో తహసీల్దారు శ్రీవాణి, ఎంఈఓలు విజయభాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి కృషి

కడప(వినాయకనగర్),డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల అభ్యున్నతికి సీఎం చంద్రబాబునాయుడు ఎనలేని కృషి చేస్తున్నారని మాజీ డిప్యూటీ మే యర్ ఆరీఫుల్లా తెలిపారు. 28వ డివిజన్ బచ్చర్ వీధిలోని అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో శనివారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై దృష్టి పెట్టాలని ప్రధానోపాధ్యాయులు జుబేర్ అహ్మద్ అన్నారు. శనివారం కడప నగరం సాలే నాగయ్య మున్సిపల్ హైస్కూలులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. అలాగే బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు షర్మిలారాణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

విద్యార్థుల ప్రగతికి కృషి చేయాలి

లింగాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రగతికి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎం పీపీ రమాదేవి అన్నారు. ఇప్పట్ల గురుకుల కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం జరిగింది.

పెండ్లిమర్రిలో...

నందిమండలం, ఎగువపల్లె జడ్పీ హైస్కూళ్లలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం శనివారం ప్రధానోపాధ్యాయులు, కమిటీ చైర్మన్‌ల అధ్యక్షతన జరిగింది. ఏఓ ఓబులేసు, ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, శివమోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతికి కృషిచేయాలి

వేముల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రగతికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషిచేయాలని వెలుగు ఏపీఎం, మీటింగ స్పెషలాఫీసర్ ఆంజనేయులు సూచించారు. శనివారం చాగలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ జరిగింది.

విద్యతో పాటు క్రీడలూ అవసరమే: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి

వీరపునాయునిపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడలూ అవసరమేనని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పాయసంపల్లె జడ్పీ హైస్కూల్లో తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు చక్కటి విద్యను అందించడం గర్వకారణంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి సత్ప్రవర్తన కలిగి ఉన్నారని, ఇంత ఘనచరిత్ర కలిగిన పాఠశాలకు ఏ చిన్న అవసరం వచ్చినా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. హెచ్‌ఎం మురళీకృష్ణ, మాజీ సర్పంచు సరోజ్మ, శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గండి ఓబయ్య యాదవ్, తలపనూరు సర్పంచు శివమారుతిరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శనగ పంటను పరిశీలించిన ఏఓ

పెండ్లిమర్రి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతసంగటిపల్లె గ్రామంలో మండల వ్యవసాయాధికారి ఓబులేసు శనగ పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేరుకుళ్లు తెగులు నేలలో ఎక్కువగా తేమ శాతం ఉండడంతో ఆశిస్తుందన్నారు. హెక్సాకోనజోల్ ఒక లీటరు నీటికి 2ఎంఎల్ కలిపి పిచికారీ చేస్తే వేరుకుళ్లను నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు.

కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలి

కడప(వినాయకనగర్), డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థీ ఏపీజే అబ్దుల్‌కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబు తెలిపారు. నకాశ్‌లోని పాఠశాలలో శనివారం జరిగిన సైన్స్‌ఫేర్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

వైసీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం

● మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా



మాట్లాడుతున్న అంజద్‌బాషా

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం జరిగిందని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా, వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి అన్నారు. పేరెంట్స్ కమిటీ సమావేశాలు పెట్టే నైతిక హక్కు కూటమి ప్రభుత్వానికి లేద న్నారు. శనివారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో వారు విలేకరుల తో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేశారన్నారు. ఎమ్మెల్యే మాధవి మాటలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయన్నారు. నగరంలో తాగునీరు సమస్య లేదని అనడం తగదన్నారు.

దేశ భవిష్యత్తుకు రథసారథులు విద్యార్థులే

కడప మారుతీనగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశభవిష్యత్తుకు రథసారధులు విద్యార్థులే అని సంఘ సేవకుడు సలావుద్దీన్ అన్నారు. కడప నకాశ్‌వీధిలో గల పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ముళ్లపొదలు తొలగించాలి

లింగాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): లింగాల ఎస్సీ కాలనీలో ఏపుగా పెరిగిన ముళ్ల పొదలను తొలగించాలని కాలనీవాసులు ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డికి వినతిపత్రం అందించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందించి తమ సమస్యలు తెలిపారు. ముళ్లపొదల వల్ల విషపురుగులు సంచరిస్తున్నాయని, కాలనీలో నివాసం ఉండాలంటే ప్రజలందరు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ముళ్లపొదలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ శ్రీనివాసరెడి హామీ ఇచ్చారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించండి

పులివెందుల టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల పట్టణ పరిధిలోని వాసవీకాలనీలో మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ రాష్ట్ర అధికార మాజీ ప్రతినిధి వేలూరు శ్రీనివాసరెడ్డి, మండల సమన్వయకర్త కేతిరెడ్డి తిరుపాల్‌రెడ్డి తదితరులు డిమాండ్ చేశారు. శనివారం వారు వాసవీ కాలనీలో ప్రవహిస్తున్న మురుగునీటిని పరిశీలించారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. లేదంటే సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు.

శిల్పారామం, ఉలిమెల్ల లేక్‌ను

సందర్శించిన చైర్‌పర్సన్



ఉలిమెల్ల లేక్ ఫ్రంట్ వివరాలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ మంజుల

పులివెందుల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని శిల్పారామం, ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌ను శనివారం శిల్పారామం చైర్‌పర్సన్ మజులరెడ్డి సందర్శించారు. అక్కడి అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. ఇంకా అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులు సమకూరేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. అనంతరం మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలియజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

కడప నాగరాజుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అఖిలభారత కమిటీ పిలుపులో భాగంగా కడప విద్యుత్ భవన్ వద్ద విద్యుత్ ఉద్యోగులు భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. చండీఘర్ విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలను ప్రైవేటు వారికి అప్పగించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ఉద్యోగుల నిరసించారు. సంస్థను ప్రైవేటీకరణ చేయరాదని చండీగర్‌లో విద్యుత్ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుదర్శనరెడ్డి మాట్లాడుతూ ప్రైవేటీకరణ వల్ల ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. విద్యుత్‌రంగాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో డిస్కం నాయకులు శివశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, జిల్లాకార్యదర్శి ఎంవీ చలపతి, డిస్కం నాయకులు బ్రహ్మానందరెడ్డి, విద్యుత్‌భవన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి శ్రీనివాసరెడ్డి పరామర్శ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కడప నగరం 5వ డివిజన్‌కు చెందిన యోహాను అనే యువకుడు ప్రమాదవశాత్తు వాటర్‌గండిలో మునిగి మృతి చెం దాడు. విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఏపీజీబీని తరలిస్తే ఉద్యమాలు ఉధృతం



ఏపీజీబీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్పీపీ బృందం

కడప సెవెన్‌రోడ్స్ డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) :నిత్యం కరువు కాటకాలతో ఉండే రాయలసీమలోని ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని, ఎంఎస్ఎంఈ ట్రైనింగ్ సెంటరును అమరావతికి తరలిస్తున్నారన్న వార్తలు ఈ ప్రాంత ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తున్నాయని, ఆ సంస్థలను తరలిస్తే ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఆర్‌పీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకరరెడ్డి హెచ్చరించారు. శనివారం కడప మరియాపురంలో ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయం ఎదుట రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఆర్పీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్దరామయ్య, ఆర్పీపీ నగర కార్యదర్శి మగ్బుల్‌బాషా, నగర కార్యదర్శివర్గసభ్యులు మడగలం ప్రసాద్, చాపల సుబ్బరాయుడు, బాల చెన్నయ్య, రమేశ్, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు: డీఎస్పీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీనాయక్

పులివెందుల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ విద్యార్థులకు సూచించారు. శనివారం స్థానిక జేఎన్టీయూ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మత్తుకు బానిస కావడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. పులివెందుల అర్బన్ సీఐ నరసింహులు, రూరల్ సీఐ వెంకటరమణ, జేఎన్టీయూ ప్రిన్సిపాల్ డి.విష్ణువర్ధన్, వైస్‌ప్రిన్సిపాల్ శేష మహేశ్వరమ్మ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ : ఎమ్మెల్యే

ఎర్రగుంట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాల అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి హామీలు ఇచ్చారు. 11క్లాస్ రూముల నిర్మాణంలో పెండింగ్‌లో ఉన్న రూ.38లక్షల నిధులు తెప్పించేందుకు కృషిచేస్తానన్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల మధ్యాహ్న భోజనశాల నిర్మించేందుకు వెంటనే ప్రతిపాదనలు పంపిస్తానని తెలిపారు. అలాగే ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, ఈఎస్‌ఐ ఆసుపత్రుల నూతన భవనాల నిర్మాణాలకు కృషి చేస్తానన్నారు. ఇంటర్, డిగ్రీ కాలేజీల వల్ల పాఠశాలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్న దృష్ట్యా వేరుగా ఉండే విధంగా భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. క్రీడా మైదానం అభివృద్ధికోసం తన వంతు కృషిచేస్తానన్నారు. క్రీడా మైదానంలో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ప్రహరీని పూర్తిగా నిర్మించాలన్నారు. అవసరమైతే మరిన్ని అదనపు గదులు ఎస్ఎస్ఏ ద్వారా మంజూరు చేయించేందుకు కృషిచేస్తానన్నారు.

సమస్యల పరిష్కారానికే ఇంటింటికి...

బద్వేలు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకే ఇంటింటికి తిరుగుతున్నామని 33వ వార్డు కౌన్సిలర్ మిత్తికాయల సునీత పేర్కొన్నారు. ఈ సందర్భంగా మిత్తికాయల సునీత మాట్లాడుతూ ప్రస్తుతం హౌసింగ్‌స్కీంలో ఇళ్లులేనివారు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులకు సచివాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని ప్రజలకు వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఇష్టపడి చదవాలి

మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో పలువురు వక్తలు

జమ్మలమడుగు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ధైర్యంతోపాటు ఇష్టంగా చదివి ఉన్నతస్థానంలో నిలువాలని అదే కూటమిప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి సూచించారు. శనివారం ఉదయం 10 గంటలకు జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం, పిల్లల బంగారు భవిష్యత్తుకోసం బడివైపు ఒక అడుగు అనే కార్యక్రమం పురస్కరించుకుని విద్యాశాఖాధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ వేదవతి,ఎంఈవోలు రమణారెడ్డి, చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ నేర్పడంలో కీలకబాధ్యత తల్లిదండ్రులదేనని ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఎర్రగుంట్ల -ముద్దనూరు రోడ్డులోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివా రం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమ్మేళనానికి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం వారు మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషాలిఫీసర్ సురేశ్‌రెడ్డి, ఎంఈవోలు శివప్రసాద్, రామాంజనేయరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ ముస్కిన్ వల్లి, సీఐ నరేష్‌బాబు, ఎన్డీయే మండల ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా ఆకతాయిలు ఆడపిల్లలను ఏడిపిస్తున్నారని ఎమ్మెల్యేకి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ఇలాంటి ఫిర్యాదులొస్తే ఊరుకోనని వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ముద్దనూరు..: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర పభుత్వం మెగా పేరెంట్స్, టీచర్స్(పీటీఎం)మీటింగ్‌ను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు.స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెలే ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు. సీఐ దస్తగిరి , తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డి, ఎంపీడీవో ముకుందారెడ్డి, విద్యాకమిటీ చైర్మెన్ రహంతుల్లా, హెచ్ఎం రాజబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండాపురం..: పాఠశాలల్లో పండగలా పీటీఏం నిర్వహించడం అభినందనీయమని జిల్లా పంచాయతి అధికారి , మండల స్పెషలాఫీసర్ తిమ్మక్క తెలిపారు. శనివారం కొండాపురం బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన పీటీఏం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఎంఈవో ఓబులేసు, తహసీల్దార్ గురప్ప, ఎంఈవో రామయ్య,ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి, హెడ్మాస్టర్ సాంబశివారెడ్డి, మాజీ సర్పంచ్‌లు విశ్వనాథరెడ్డి, రామలింగేశ్వరరెడ్డి, రెండెద్దులరామాంజులరెడ్డి పాల్గొన్నారు.

పెద్దముడియం..: ప్రభుత్వ పాఠశాలలఅభివృద్ధికి దోహదపడాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నాగేశ్వర్‌రావు కోరారు. మండల పరిధిలోని పెద్దపసుపుల కస్తూర్బాపాఠశాలలో శనివారం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం జరిగింది. కస్తూర్బా పాఠశాలల కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసరు మౌనిక, ఇతర ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మైలవరం..: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సతీమణి అరుణ అన్నారు. శనివారం మైలవరంలోని బాలికల గురుకుల పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ మీట్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంఈవో చిట్టిబాబు, ఎంపీడీవో రామచంద్రారెడ్డి, సిద్ధేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

బద్వేలుటౌన్..: ప్రతి విద్యార్థి విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని ఆర్డీఓ చంద్రమోహన్ అన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన తల్లి దండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయభాస్కర రాజు, మున్సిపల్ కమిషనర్ వాకమల్ల నరసింహారెడ్డి, ఎస్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

బద్వేలుటౌన్..: చదువుతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితీశ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గురుకుల పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, సుబ్బరాయుడు, మిత్తికాయల రమణ, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. కాగా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు బోవిళ్లవారిపల్లెలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ధనలక్ష్మి, స్కూలు కమిటీ అధ్యక్షురాలు సునంద, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుధారాణి, టీడీపీ నాయకులు జీవీ సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, పార్వతి, రమణారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అట్లూరు..: మండలంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ప్రత్యేక అధికారి ఫణిశ్రీ శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు సుబ్బలక్షుమ్మ, ఎంపీడీవో భాస్కర్ బాబు, ఎంఈవో ఖాదర్‌వల్లి, మండల ఇన్‌చార్జ్ రెడ్డయ్య, నాయకులు మల్లికార్జునరెడ్డి, మునిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, జయక్రిష్ణారెడ్డి, పొత్తపి నరసింహులు పాల్గొన్నారు.

బి.కోడూరు..: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం శనివారం బి.కోడూరు మండలంలోని అన్ని పాఠశాల ల్లో ఘనంగా నిర్వహించారు. కాసానగర్ వద్ద ఉన్న కస్తూర్బాగాంధీ పాఠశాలలో మండల ప్రత్యేక అధికారి నాగేశ్వర్‌రావు, ఎంపీడీవోభాస్కర్‌రావు, ఎంఈవో సునీల్ కుమార్‌కు విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఘన స్వాగతం పలికారు.

కలసపాడు..: పాఠశాలల్లో విద్యార్థుల పెరుగుదలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య ఆత్మీయంగా సమ్మేళనం ఉండాలని ఎంఈవో మస్తాన్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పెరుగుదలకు ఉపాధ్యాయుల కృషితో పాటు తల్లిదండ్రుల సహాయం ఉందన్నారు.

పోరుమామిళ్ల..: విద్యార్థులకు మెరుగైన విద్య అందించడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని ఏర్పాటు చేసిందని తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఓఎల్ఎఫ్ ఉన్నత బాలికల పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తహసీల్దారు చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ యనమల సుధాకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో విజయరాణి, మాజీ ఉపసర్పంచ్ షరీఫ్, వీఆర్వో ప్రతాప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

గోపవరం..: రాచాయిపేట లోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పేరెంట్స్ టీచర్స్ మీట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ముఖ్యంగా రంగవల్లుల పోటీలు, అలాగే పురుషులకు తాడులాగు పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు విద్యాకమిటీ చైర్మన్ వెంకటరమణ బహుమతి ప్రదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసులు ఆధ్వర్యం లో నిర్వహించారు.జడ్పీటీసీ కె.జయరామిరెడ్డి, పీహెచ్‌సీ మహేశ్వర్‌రెడ్డి,విద్యాకమిటీ చైర్మన్ వెంకటరమణ పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్..: ఉపాధ్యాయులు,తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం ఎన్నడూ మరువలేనిదని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ కొనియాడారు.మైదుకూరు మున్సిపాలిటీ, మండలంలో శనివారం ఉపాధ్యాయుల,తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాన్ని ఘనంగా జరుపుకున్నారు.ఈ సమావేశానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ముఖ్యఅతిగా పాల్గొన్నారు. పాఠ శాలల్లోని పలు సమస్యపై ఎమ్మెల్యే స్పందించి వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

దువ్వూరు..: దువ్వూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పాల్గొని వారు తెచ్చిన పలు సమస్యలకు స్పందించి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేను సన్మానించారు. కాగా పుల్లారెడ్డిపేటలోని కస్తూరిబాగాంధీ గురుకుల పాఠశాలలో మెగా పేరెంట్స్‌డే కార్యక్రమం జరిగింది.

చాపాడు..: మండలంలోని అన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యమని మండల స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి, తహసీల్దారు రమాకుమారి, హెడ్మాస్టర్ మహ్మద్‌గౌస్ అన్నారు. చాపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ జరిగింది. హెడ్మాస్టర్ నరసింహశాస్త్రి, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, ఎస్ఐ చిన్నపెద్దయ్య పాల్గొన్నారు.

కాశినాయన..: మండలంలోని ప్రభుత్వ,ఎయిడెడ్ పాఠశాలల్లో తల్లి దండ్రుల ఉపాధ్యాయుల సమ్మేళనా కార్యక్రమం ఘనంగా సందడిగా సాగింది. నర్సాపురం మోడల్ పాఠశాలలో తహసీల్దారు వెంకటసుబ్బయ్య,కోడిగుడ్లపాడు జడ్పీఉన్నతపాఠశాలలో ఎంఈవో నిర్మల,వరికుంట్ల కస్తూర్బా ఉన్నతపాఠశాలలో ఎంపీడీవో మైథిలీరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ముగ్గుల పోటీలు, తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం భోజనాలు ఏర్పాటుచేశారు.

రాజుపాలెం..: మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో అట్టహాసంగా నిర్వహించారు. ఆత్మీయ సమావేశానికి తల్లిదండ్రులు వారి పిల్లలను ఆహ్వానించడంతో పాటు గ్రామాల్లోని టీడీపీ నాయకులు విద్యాకమిటీ చైర్మన్లను ప్రత్యేక ఆహ్వానితులుగా చేశారు. పర్లపాడు గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ సమావేశంలో టీడీపీ నాయకులు మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు.

ప్రొద్దుటూరు టౌన్..: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయసమావేశం ప్రభుత్వ పాఠశాలలో పండుగ వాతావరణంలో జరిగింది. శనివారం మండలంలోని 110 పాఠశాలలో సమావేశం నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు, టగ్‌ఆఫ్‌వార్, కబడ్డీ, క్రికెట్ వంటి క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం విద్యార్థులు, తల్లిదండ్రులకు భోజనం ఏర్పాటు చేశారు. మోడంపల్లె ఉర్దూ హైస్కూలులో జరిగిన ఆత్మీయ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహకకార్యదర్శి వీఎస్.ముక్తియార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాఠశాల హెచ్ఎం ఇమామ్‌హుస్సేన్, టుటౌన్ సీఐ యుగంధర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఖాజీపేట..: మనం సంపాదించిన ఏదైనా దొంగలించవచ్చు కానీ ఒక్క చదువును మాత్రం దొంగలించలేరని ఎంపీడీవో దివిజాసంపతి అన్నారు. శనివారం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమ్మేళనం మండల పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మండల టీడీపీ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. మండల పరిదిలోని ప్రభుత్వ పాఠశాలలు కస్తూరిబాగాంధీ స్కూలు, బాలికోన్నత, బాలుర ఉన్నత స్కూల్, మోడల్‌స్కూల్, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు మహబూబ్‌బాష, కస్తూరిబా ప్రధానోపాధ్యాయురాలు భార్గవి, స్కూల్ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: విద్యార్థుల భవిష్యత్తు తల్లిదండ్రుల చేతుల్లో ఉందని వారి భవిస్యత్తును తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు కృషి చేస్తారని మండల టీడీపీ అధ్యక్షుడు చెన్ను పల్లి సుబ్బారెడ్డి అన్నారు. మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ఘనంగా అధికారుల సమక్షంలో చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.





జమ్మలమడుగులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, మైదుకూరులో పాల్గొన్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్



బద్వేలులో మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రమోహన్‌రాజు



బద్వేలు...గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న రితీశ్‌కుమార్‌రెడ్డి



బద్వేలు... పీటీఎంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ



పోరుమామిళ్ల.. సమావేశంలో మాట్లాడుతున్న యనమల సుధాకర్



ప్రొద్దుటూరులో మాట్లాడుతున్న వీఎస్ ముక్తియార్

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

జమ్మలమడుగు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో శనివారం సాయంత్రం అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. పెన్నానది తీరాన వెలసిన అయ్యప్పస్వామి ఆలయం వద్ద నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. పట్టణంలో స్వామి వెంట మహిళలు పాల్గొన్నారు. వివిధ వేషధారణలతోపట్టణంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వామి సేవా సమితి వారు పాల్గొన్నారు.

వివాదాలను పరిష్కరించే ప్రక్రియే మధ్యవర్తిత్వం

బద్వేలు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వివాదాలను పరిష్కరించేందుకు మధ్యవర్తిత్వమన్నది ఒక మంచి ప్రక్రియ అని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సీనియర్ సివిల్‌జడ్జి వై.జె పద్మశ్రీ పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో బార్‌అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులకు మధ్యవర్తిత్వం అనే అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

మోసాలపై విచారణ జరిపించాలి

జమ్మలమడుగు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో శనివారం మైలవరం మండలం దండు మారెమ్మ దేవాలయం వారసత్వ అర్చకుడుగా పనిచేస్తున్న తుపాకుల పుల్లమ్మ భర్త విజయభాస్కర్ జరిగిన మోసాలపై విచారణ జరిపించాలని ఆర్డీవో సాయిశ్రీకి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ దండుమారెమ్మదేవాలయంలో తమ కుటుంబ సభ్యులంతా వారసత్వంగా కొన్ని తరాల నుంచి కొనసాగుతున్నామన్నారు. అయితే ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన వైసీపీ నాయకులు శేగిరెడ్డి గంగిరెడ్డి, ఆవుల వెంకటరామిరెడ్డి అనే వ్యక్తులు పెద్దమనుషులుగా వచ్చి దేవాలయ కమిటీలో స్థానం కల్పించి అభివృద్ధి చేస్తామని చెప్పి గ్రామంలోని భక్తుల నుంచి భారీగా వసూలు చేశారన్నారు. కాగా విచారణచేసి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హామీ ఇచ్చారన్నారు.

గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌తో మున్సిపాలిటీకి ఆదాయం: ఎమ్మెల్యే వరద

ప్రొద్దుటూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ ఖాళీ స్థలాల్లో పెట్రోల్ బంకు, గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేయడం వలన మున్సిపాలిటీకి ఆదాయం వస్తుందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కొర్రపాడురోడ్డులోని మున్సిపల్ పెట్రోల్ బంకు ఆవరణలోనే గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ పెట్రోల్ బంకు నిర్వహణ మున్సిపాలిటీ చేపట్టడం వలన నెలకు ఐదులక్షల మేరకు మున్సిపాలిటీకి ఆదాయం వస్తుందన్నారు. అలాగే గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ వలన కూడా మున్సిపాలిటీకి మంచి ఆదాయం వస్తుందన్నారు. దీనికి తోడు పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. గ్యాస్‌ను వినియోగించడం వలన పొగ కాలుష్యాన్ని నగరాల్లో నివారించవచ్చన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ లక్ష్మీపేట గురివిరెడ్డి, కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి,కమాల్, జిలాన్,మాజీ కౌన్సిలర్ జంబాపురం రామాంజనేయులురెడ్డి, టీడీపీ నాయకులు చింతకుంట కుతుబుద్దీన్, మీగడ చంద్ర ,చెన్నయ్య పెట్రోల్ బంకు మేనేజర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్‌ను కలిసిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



ప్రొద్దుటూరు , డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మెగా పేరెంట్స్ మీటింగ్ కోసం కడప కు వచ్చిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కలిశారు. పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం కడప మున్సిపల్ హైస్కూల్లో జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన రితీశ్‌రెడ్డి



కాశినాయన డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): కడప పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన అధ్యక్షుడు కే.పవన్‌కళ్యాణ్‌ను శనివారం బద్వేల్ టీడీపీ నాయకురాలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, పార్టీ సమన్వయ కర్త కే.రితీష్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసంద ర్భంగా కాశినాయన మండలంలోని కాశినాయన జ్యోతిక్షేత్రం అభివృద్ధికి కేంద్ర అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని కోరుతూ సమస్యను ఆయనకు సమగ్రంగా వివరించారు.అనంతరం అందుకు సంబంధించిన పూర్తి వివరాలతోకూడిన ఫైల్‌ను పవన్‌కళ్యాణ్‌కు అందజేశారు.ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి, టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, వడ్డమాను విజయ్‌కుమార్‌రెడ్డి,నాయకులు పాల్గొన్నారు

ఘనంగా మాజీ మంత్రి డీఎల్ జన్మదిన వేడుకలు



అన్నదానం చేస్తున్న డీఎల్ అభిమానులు

ఖాజీపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి 74వ జన్మదిన వేడుకలను ఖాజీపేటలో ఘనంగా నిర్వహించారు. శనివారం ములపాకు సమీపంలో ఉన్న లారెన్స్ అనాథ శరణాలయంలో వృద్ధులకు భోజనం ఏర్పాటు చేశారు. అలాగే డీఎల్ స్వగృహం వద్ద కేక్ కట్ చేసి అనంతరం భోజనాలు ఏర్పాటు చేశారు. రెయిన్‌బో హైస్కూలులో కేక్ కట్‌చేసి పిల్లలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్ అభిమానులు మురళీమోహన్‌రెడ్డి, ఓబుళరెడ్డి, మోహన్, గురప్ప, గురుప్రసాద్, డీఎల్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని గుడారాలపై చర్యలు తీసుకోవాలని వినతి

జమ్మలమడుగు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గండికోటలో గ్రామస్థులు, ఇతరులు ఇష్టారాజ్యంగా వేసుకున్న అనుమతి లేని గుడారాలు (టెంట్లు)పై చర్యలు తీసుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వరరావుకు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ వినతి పత్రం అందజేశారు. శనివారం సాయంత్రం డీఎస్పీ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం ఇచ్చిన తర్వాత ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ సభ్యులు సురేంద్ర, పుష్పరాజు, సురేష్, హుస్సేన్‌మియా తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరులో సినీనటి అనసూయ హల్‌చల్



మాట్లాడుతున్న అనసూయ

మైదుకూరు రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు పట్టణంలో సినీనటి అనసూయ మైదుకూరు ఆర్‌టీసీ బస్‌స్టాండ్‌లో శనివారం ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు. అనసూయను చూసేందుకు జనాలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కానీ షాపు ఆర్‌టీసీ ప్రాంగణంలో ఉండటంతో ఒక వైపు దారిని పూర్తిగా మూసివేశారు.ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అనసూయ వస్తుందంటూ జనాలను సుమారు 5 గంటల పాటు ఎండలోనే నిలబెట్టేశారు.అనసూయ కార్యక్రమం కోసం ఆర్‌టీసీ ప్రాంగణం అంతా మూసేయడానికి ఎలాంటి అనుమతి తీసుకోలేదని డిపో మేనేజర్ ఆంధ్రజ్యోతితో తెలిపారు.